www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 8 జులై 2024

5

అన్నమయ్య



నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి- రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు నేడే సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావాలని తెలిపారు.

సమన్వయంతో పనిచేసి

మండల అభివృద్ధికి కృషి చేయాలి

- అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి /సంబేపల్లి

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట రవాణా , యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సంబేపల్లి మండల పరిషత్ సమావేశ భవనంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాటాడుతూ సంబేపల్లి మండలం గతంలో అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనుకబడి ఉందని, ఇకనుంచి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. మండలంలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి వెంటనే నివేదిక తయారు చేసి తమకు పంపాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ కాలువలకు సంబంధించి నివేధికలు పంపాలన్నారు. జల్ జీవన్ మిషన్ లక్ష్య సాధనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాల ప్రాధాన్యతను గుర్తిస్తూ ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పనులకు సంబంధించి ఎంపిడిఒ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇలు క్షేత్రస్థాయిలో పరిశీలించి జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టాల్సిన నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలన్నారు. సంబేపల్లి మండలంలో ఎన్ని మంచినీటి పథకాలు పనిచేస్తున్నాయి, ఎన్ని బోర్లు ఉన్నాయి తదితర వివరాలు సమర్పించి మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్ధవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడా లన్నారు. ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్నదే ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని హౌసింగ్ రిలేటెడ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేసి హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి అయ్యేటట్లు చూడాలన్నారు. సంబేపల్లి మండలంలో ఇప్పటివరకు ఎన్ని ఇల్లు మంజూరయ్యాయి, ఎన్ని ప్రారంభించారు. ఇంకా ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయనే వివరాలను 15, రోజుల లోపల తమకు పంపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. మండలంలో డాక్టర్లు, సిబ్బంది సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది పారదర్శకంగా పనులు చేయాలన్నారు. మండలంలో చాలావరకు భూ ఆక్రమణలు జరిగాయని ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆక్రమణలకు గురైన భూముల వివరాలను నెల రోజుల లోపల తమకు పంపాలన్నారు. గతంలో రోడ్లు వేయకుండా బిల్లులు చేయడం జరిగిందని ఇలాంటివన్నీ అధికారులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సంబేపల్లి మండలం, గుది యవాండ్లపల్లి గ్రామంలో దాతలు స్థలం ఇచ్చిన ప్పటికీ ఇక్కడ అంగన్వాడీ భవనాన్ని నిర్మించేందుకు అధికారులు నిర్లక్ష్యం చేయడం జరిగిందని వెంటనే భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. త్వరలో నియోజకవర్గం వారీగా సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించడం జరు గుతుందని, అధికా రులందరూ తమ పరిధిలో జరిగే అభివృద్ధి కార్య్ర కమాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో తహ శీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నిర్మలాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తాం

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి అందరి సహకారంతో అన్నమయ్య జిల్లా అభివృద్ధికి పాటు పడతామని అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు వేద పండితులు పూంకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాలు అనంతరం శ్రీధర్ చామకూరి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన తాను బాపట్ల జాయింట్ కలెక్టర్‌గా పని చేశానని చెప్పారు. తనను రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా నియమించిందన్నారు. ఇది తన మొట్టమొదటి కలెక్టర్ పోస్ట్ అని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ ఉన్నటువంటి జాయింట్ కలెక్టర్, డిఆర్‌ఒ, ఆర్‌డిఒలు, జిల్లా అధికారుల బృందం, ప్రజా ప్రతినిధులు ప్రజలు అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి పాటు పడతామని పేర్కొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణరావు కలెక్టర్‌కు పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఆర్‌డిఒలు, పలువురు జిల్లా అధికారులు, జిల్లా రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, పాత్రికే యులు, ప్రముఖులు తదితరులు పుష్పగుచ్చాలు, పూల మొక్కలతో జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్ చామకూరి

వీరభద్ర స్వామిని దర్శించుకున్న కలెక్టర్

రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా నియమించిన శ్రీధర్ చామకూరి ఆదివారం ఉదయం రాయచోటిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వేదమంత్రోచ్చారణలతో కలెక్టర్‌ను ఆలయంలోకి తీసుకెళ్లారు. ఈ సంద ర్భంగా శ్రీ వీరభద్ర స్వామిని, భద్రకాళి అమ్మ వారికి భక్తిశ్రద్ధలతో కలెక్టర్ ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు కలెక్టర్ కు తీర్థ ప్రసాదాలు అందించి వేదాశ్వీరచనం చేశారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వ నాధ్ ఆలయ విశిష్టత గురించి కలెక్ట ర్‌కు వివరించారు. కార్యక్ర మంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి రమ ణారెడ్డి, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

జిల్లాకు మంచిపేరు తీసుకురావాలి

అన్నమయ్య జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేద్దామని జిల్లా అధికారులతో కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులతో తన చాంబర్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులను ఆ శాఖ గురించి కుప్తంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడు తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించి ఆయా కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా అధికారులందరూ పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించి అధికారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డిఆర్‌ఒ సత్యనారాయణ రావు, ఆర్డీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా ముందుకెళ్దాం

మాజీ సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంత దూరమైనా వెళ్దామని, కలిసి కట్టుగా ముందుకెళ్లి సమస్యలను పరిష్కరించుకుందామని మాజీ సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం భాకరాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అందరిని పేరుపేరునా పలకరించి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలకు, నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలు విన్నవించుకున్నారు. కొందరు వినతి పత్రాలు సమర్పించారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చారు. ముఖ్యంగా వైసిపి శ్రేణులు తమ సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. కలిసి కట్టుగా ముందుకెళ్లాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో ప్రతి కార్యకర్తకు, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ చిరునవ్వుతో మంచి రోజులు వస్తాయి వేచి చూద్దామని చెప్పారు. టిడిపి నాయకులు చేస్తున్న దాడులపై న్యాయ పోరాటం చేద్దామని వైసిపి నాయకులకు కార్యకర్తలకు అండగా ఉండేందుకు కమిటీని రూపొందిస్తామని, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ అండగా ఉంటారని తెలిపారు. అనంతరం పులివెందులలో పాము కాటుకు గురై మరణించిన బాలిక కుటుం బాన్ని పరామర్శించారు. చిన్నారికి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. లింగాల మండలం పెద్దకూడాలలో మాజీ మండల అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి సతీమణి లక్ష్మినరసమ్మ అనారోగ్యంతో మృతిచె ందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన కడప ఎంపీ వై.ఎస్. అవినాష్‌రెడ్డి, నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పేరుకే ప్రజా దర్బార్ ..

సిఫారసులు ఉంటేనే జగన్ దర్శనం

మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా రెండో రోజు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు , అభిమానులు భారీగా తరలివచ్చారు. కానీ జగన్ దరిదాపుల్లోకి పోవడానికి పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి పహారా ఏర్పాటు చేశారు. సిఫార్సు ఉన్న నాయకులను మాత్రమే జగన్ దర్శనం కలిగింది. నాయకుల కోసమే ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారా లేక ప్రజల కోసమా అంటూ బహిరంగ విమర్శలు ఉన్నాయి. సామాన్య కార్యకర్తలు జగన్ కలిసేందుకు గంటల తరబడి భారీ గేట్ల వద్ద పడిగాపులు కాసి వెను తిరిగారు. అధికారం కోల్పోయినా తీరు మార్చుకోలేదని వైసిపి శ్రేణులే విమర్శించడం తీరు మారకపోతే పార్టీకి మరింత నష్టం జరుగుతుందని, నమ్ముకున్న కార్యకర్తలు దూరం అవుతారని పార్టీ శ్రేణులు చర్చించుకోవడం గమనార్హం.

'తవ్వా'ను అభినందించిన జగన్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ అధికార భాష సంఘం పూర్వ రాష్ట్ర సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జీవితంపై రచించిన 'ఓ ధీరుడి పయనం' సమరం నుంచి సంక్షేమం వైపు అనే పుస్తకాన్ని పులివెందులలోని జగన్మోహన్ రెడ్డి స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వెంకటయ్య చేసిన కృషిని అభినందించారు. కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి రాజకీయ రంగంలో అంచలంచలుగా ఎదిగిన వైనాన్ని చాటి చెప్పిన వెంకటయ్యను ప్రశంసించారు. ఎపిఎస్ఆర్‌టిసి జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ దళిత కుటుంబంలో పుట్టిన వెంకటయ్య తెలుగులో డాక్టరేట్ పూర్తి చేసి సాహిత్యకారులకు, పరిశోధకులకు, విమర్శకులకు, కథా రచయితలకు గర్వకారణంగా నిలిచారన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ వెంకటయ్య రాయలసీమ కథా సాహిత్యం పై పరిశోధన చేసి అనేక నూతన అంశాలను వెలుగులోకి తెచ్చి రాయలసీమ కథా సాహిత్య చరిత్రను తిరగరాసారన్నారు. కార్యక్రమంలో కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రెడ్యం చంద్రశేఖరరెడ్డి, శివరాం యాదవ్ పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధికి ఎంపిజె పనిచేయాలి

- మత పెద్ద షేక్ సిరాజుద్దీన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ముస్లిముల అభివృద్ధి కోసం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) సంస్థ పని చేయాలని ముస్లిం మత పెద్ద షేక్ సిరాజుద్దీన్ కోరారు. ఆదివారం పట్టణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలను ముస్లిం పేదలకు అందే విధంగా ఎంపీజే నాయకులు కృషి చేయాలని కోరారు. ఉర్దూ స్కూళ్లను, మైనార్టీ హాస్టళ్ల పనితీరును పరిశీలించి లోటుపాట్లు, విద్యార్థులకు ఇబ్బందులు ఉంటే ప్రభుత్వ అధికారుల దృష్టికి సమస్యను తీసుకొని వెళ్లి పరిష్కరించాలని ఆయన సూచించారు. అనంతరం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాజంపేట నియోజకవర్గం అధ్యక్షులుగా పి.మోసిన్ ఖాన్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ నిహాల్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రహిమాన్, సహాయ కార్యదర్శిగా అబ్దురా రెహమాన్, కోశాధికారిగా షేక్ అలీ, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం నాయకులు ఎస్.ముజఫర్ అహ్మద్, ఎస్.జి ఈనాయాతుల్లా, ఎస్.ఎం.డి కరీం, షేక్ మహబూబ్ బాషా, మిల్లర్ కరీం, అంజాద్ రెహమాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మత పెద్ద షేక్ సిరాజుద్దీన్

సిపిఎం నాయకులపై దాడి అప్రజాస్వామికం

- జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెన్షన్ దారులకు అండగా నిలబడినందుకు సిపిఎం నాయకులు, పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కామినేని రామారావుపనై టిడిపి నాయకుల దాడి అప్రజాస్వామికమని, దాడిచేసి గాయపర్చిన వారిని వెంటనేకఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్టం మొత్తం ఇంటింటికి సామజిక పింఛన్లు పంపిణీ చేస్తే పల్నాడు జిల్లా పగటిచర్ల టిడిపి నాయకులు చిగురుపాటి. ఆదినారాయణ తన ఇంటి వద్దకు లబ్ధిదారులు రావాలని గ్రామంలో చాటింపు వేయించడం ,వారిని తన ఇంటి చుట్టూ తిప్పుకోవడాన్ని ప్రశ్నించిన రామారావు మీద టిడిపి నాయకులు దాడి చేశారని తెలిపారు. గత వైసిపి దాడిలో దెబ్బలు తిన్న టిడిపి వారికి సిపిఎం అండగా నిలబడ్డ విషయాన్ని టిడిపి గ్రహించాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించిన వారి మీద దాడి చేస్తే వైసిపి గతే పడుతుందని హెచ్చరించారు. అలాగే స్కీమ్ వర్కర్లను రాజకీయ కోణంలో చూడరాదన్నారు. పార్టీలు కులమతాలకతీతంగా ఎక్కడ పేదలకు ఉద్యోగులకు అన్యాయం జరిగినా వారికి సిపిఎం అండగా నిలబడి పోరాటాలు చేస్తుందన్నారు. ఇలాంటి దాడులతో సిపిఎం ఉద్యమాలను ను ఆపలేరని, దాడుల మీద మంచి పాలన చేయమని హితువు పలికారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ. రామాంజులు, సిపిఎం సీనియర్ నాయకులు టి. హరిశర్మ, సిపిఎం నాయకులు జి. మాధవయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు



తైవాన్‌లో పాల్గొన్న మిట్స్ విద్యార్థులు

ఇంటర్న్‌షిప్‌కు తైవాన్‌కు వెళ్లిన

'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనడానికి తైవాన్ దేశానికి వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోని కొత్త నైపుణ్యాలు, టెక్నిక్‌లను నేర్చుకోవడానికి 10 మంది విద్యార్థుల బృందం ఈనెల 8 నుంచి 15 ఆగస్టు వరకు రీసెర్చ్ ఇంటర్న్‌షిప్ కోసం తైవాన్‌లోని ఆసియా యూనివర్సిటీకి వెళ్లింది అని ఆయన అన్నారు. కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న సాయి మౌనిష్, దాదాపీర్, రిషిత, ప్రణీత, సాయి స్ఫూర్తి, అమేయ శ్రీ , ధనుష్ రెడ్డి, అలీ సయ్యద్, ఇందు ఈశ్వర్ శివాని, పూజిత వెళ్లారని చెప్పారు. అంతర్జాతీయ ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ యెన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ యూ. విజయ లక్ష్మి, అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

కువైట్‌లో కొండూరు వాసి గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-అట్లూరు

మండలంలోని కొండూరు గ్రామం కొత్తకోటపాడు కాలనీ వాసి గురువారం గంప చిన్న నరసింహులు కుమారుడు గంప చిన్నపెంచలయ్య (55) గుండెపోటుతో మృతిచెందారు. కువైట్ గ్రెన్ అధాన్ వైద్యశాలలో వైద్యులు గుండె ఆపరేషన్ చేస్తుండగా ఆకస్మికంగా మృతి చెందారు. గంప చిన్న పెంచలయ్య జీవనోపాధి నిమిత్తం 25 ఏళ్ల కిందట కువైట్‌కు జీవనోపాధి కోసం వెళ్లారు. అక్కడ గృహ నిర్మాణ పనులు చేసేవారు. ఈ క్రమంలోనే రోజు మాదిరిగానే బుధవారం పనులు చేస్తుండగా గుండెపోటు వచ్చింది. ఈ విషయం తమ కుమారులకు వాయిస్ మెసేజ్ పెట్టి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. గురువారం గుండెకు సర్జరీ జరుగుతుండగా అకస్మాత్తుగా మృతి చెందారు. పెంచలయ్య మృతితో కొండూరు గ్రామంలో విషాదఛాయలు అమలుకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

బడుగు, బలహీన వర్గాలకు

వెన్నెముక ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బడుగు, బలహీన వర్గాల ప్రజల వెన్నెముక ఎంఆర్‌పిఎస్ అని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు వెలగచర్ల శివయ్య తెలియజేశారు. మాదిగల రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ 60వ పుట్టినరోజును పురస్కరించుకొని ఎంఆర్‌పిఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల పరిధిలోని డిబిఎన్ పల్లెలో జిల్లా నాయకులు బాలిపోగు సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా ఎగురవేసి గౌరవ వందనం చేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వెలగచర్ల శివయ్య మాట్లాడుతూ అనగారిన వర్గాలకు ఎంఆర్‌పిఎస్ అండగా నిలబడుతుందని, మంద కృష్ణ మాదిగ పోరాటాలతోనే నేడు సామాజిక, వికలాంగుల పింఛన్లు నిరుపేదలు అందుకోగలుగుతున్నారని తెలిపారు. మాదిగలు చర్మకార వృత్తి నుంచి విద్యావంతులుగా, మేధావులుగా, ఉన్నతాధికారులుగా సమాజంలో ఉన్నత స్థితిలో మనగలుగుతున్నారని, దీని వెనుక ఎంఆర్‌పిఎస్ సుదీర్ఘ పోరాటం ఉందని అన్నారు. ఎస్‌సి వర్గీకరణ సాధించడమే తమ లక్ష్యమని, ఇందుకు మాదిగలంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వడ్డెర పెంచలయ్య, చేమూరు వెంకటేష్, ఎంఎస్‌పి జిల్లా నాయకులు వంగపూరి జయరాం, గ్రామస్తులు కె.సుబ్బరాయుడు, తుమ్మలూరు పెద్ద నరసింహులు, మంగళ నరసింహులు, తుమ్మలూరు హరిప్రసాద్, చంద్రశేఖర్, కత్తి రమేష్, టీ.కళ్యాణ్, ఎస్.బాలాజీ, పెంచలయ్య, చంద్ర, రెడ్డెయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవితో కలిసి ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులు, విద్యార్థులు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల కాలుష్య నివారణ జరిగి అందరూ ఆరోగ్య కరమైన జీవితాన్ని కొనసాగించవచ్చని అన్నారు. చెట్లు లేకపోతే వాతావరణం కాలుష్యమై ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. భావితరాల కోసం ప్రతి విద్యార్థీ విధిగా మొక్కలు నాటి చెట్లను పెంచాలని కోరారు.



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటయిన ఎన్‌డిఎ ప్రభుత్వం ఎన్నికల ముందు వివిధ సందర్భాలలో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ చట్టాన్ని అమలు చేసే దిశగా బోర్డును పునరుద్ధరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం పూర్వపు అధ్యక్షులు ఎస్.మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 వేలకుపైగా ఉన్న కార్మికుల క్లెయిములు ఆర్థిక సాయాన్ని అందించాలని అన్నారు. ఆదివారం ఏఐటియుసి అనుబంధ కార్మిక సంఘమైన శ్రీషిరిడి సాయి పెయింటర్స్ యూనియన్ బి.కొత్తకోట ఏరియా సమితి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు కే.రమేష్‌రెడ్డి అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్.మనోహర్ రెడ్డి, సీనియర్ కార్మిక నాయకులు ఎస్.ఐషీరాజన్ పాల్గొని మాట్లాడారు. గతంలో సంక్షేమ బోర్డు ద్వారా సంబంధించిన కార్మికులకు ప్రమాద మరణం, సహజ మరణం, ఆడపిల్లల వివాహ కానుక, ఆడపిల్లల కాన్పులు కానుక, పిల్లల చదువులకు స్కాలర్‌షిప్, చిన్నచిన్న వ్యాధులకు నష్టపరిహారం, కార్మికులకు శిక్షణ,ఉచితంగా పనిముట్లు పంపిణీ తదితర సదుపాయాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్.షమీవుల్లా, పెయింటింగ్ కార్మికులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే శ్రీధర్, ముక్కా వరలక్ష్మి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కోడూరు మండలం రాఘవ రాజాపురం పంచాయతీ పరిధిలోని గంగరాజుపురం గ్రామంలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి గంగమ్మ జాతరలో పాల్గొన్నారు. గ్రామస్తులు వారికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌డిఏ కూటమి ముఖ్య నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, సుబ్బరాజు, కొమ్మ శివ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

పుల్లంపేట: మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లె గ్రామం నందు వెలసి ఉన్న మల్లాలమ్మను ఆదివారం రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, సతీమణి వరలక్ష్మి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ దర్శించుకున్నారు. ఆర్ గొల్లపల్లి చెందిన వరలక్ష్మి ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించి ఎల్లవేళలా అండ బాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో జేజే వెంకటసుబ్బారెడ్డి, రెడ్డయ్యరెడ్డి, జనసేన నాయకులు పసుపులేటి వెంకటరమణ, రొంపిచర్ల మురళి, నాగిరెడ్డి ధర్మారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, నాయుడు రామయ్య, కంచర నరసింహారెడ్డి, శివకుమార్, రమేష్, రామిరెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి -ఓబులవారిపల్లి

మండలంలో గాదెల వెంకట రామాపురంలో దివంగత పల్లా పెద్ద సుబ్బారాయుడు జ్ఞాపకార్థం వారి సతీమణి పల్లా గిరిజా రాయుడు కుమారులు కిషోర్, కిరణ్, అనిల్ కుమారులు ఉచితంగా అందరికి కల్యాణమండపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల అధినేత కె పి.వి.సుబ్బయ్య హాజరై సుబ్బారాయుడి విగ్రహ ఆవిష్కరణ చేశారు. గొప్ప మనస్సు ఉన్న వ్యక్తి పల్లా పెద్ద సుబ్బారాయుడు అని కొనియాడారు. తండ్రి ఆశయం కోసం పేదలకు ఉచితంగా కళ్యాణ మండపం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కావరలక్ష్మి, పెద్ద సుబ్బారాయుడు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జి.ఎన్. నాయుడు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రీజెన్సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జి.ఎన్ నాయుడు, ఎం.డి నరాల సత్యేంద్ర ప్రసాద్, రీజెన్సీ సంస్థల డైరెక్టర్ నరాల రాధికలు ఆదివారం హైదరాబాద్ లోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జిఎన్ నాయుడు మాట్లాడుతూ పుదుచ్చేరిలో పాలనా వ్యవహారాలు, ప్రభుత్వ పనితీరు, పరిశ్రమలకు ప్రభుత్వ సహకారం, రీజెన్సీ సిరమిక్స్ పరిశ్రమ పునరుద్ధరణ, ప్రగతి తదితర అంశాలపై చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వపరంగా రీజెన్సీ పరిశ్రమ అభివృద్ధికి ఎంతటి సహకారాన్ని అయినా అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు చంద్రబాబు భరోసా ఇచ్చారని అన్నారు. చంద్రబాబుతో ఎన్నో దశాబ్దాలుగా సన్నిహిత మిత్రులుగా ఉన్న జి.ఎన్ నాయుడు ఎన్నో విషయాలపై వారిరువురూ చర్చించుకున్నట్లు వివరించారు. అనంతరం అల్లుడు సత్యేంద్రప్రసాద్, కుమార్తె రాధికను చంద్రబాబుకు పరిచయం చేశారు. బాబు సారథ్యంలో ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేలా దశల వారీగా ప్రణాళిక బద్ధంగా ముందుకు అడుగులు వేయడం శుభపరిణామమని అన్నారు.

జనసేన విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జనసేన విజయోత్సవ ర్యాలీని ఆదివారం మదనపల్లె పట్టణ పురవీధుల్లో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో రాజంపేట పార్లమెంటుతో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. భారతదేశ రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ పార్టీకి సాధ్యం కాని వంద శాతం స్ట్రైక్ రేట్‌తో జనసేన పోటీ చేసిన అన్ని స్థానాలను గెలుచుకుని చరిత్ర సృష్టించిదని అన్నారు. ఈ ఘన విజయాన్ని పురస్కరించుకుని విజయోత్సవ ర్యాలీ నిర్వహించామన్నారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలకు పాలాభిషేకం చేసి గజమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అమర్‌నారాయణ, పుంగనూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి చిన్న రాయల్, తంబళ్లపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయినాథ్, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెజవాడ దినేష్ , రాయచోటి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సయ్యద్ పఠాన్, జనసేన పార్టీ నాయకులు మైఫోర్స్ అధ్యక్షులు హరిబాబు, వాయల్పాడు ఈశ్వరయ్య, గంగాధర్, కొత్తకోట మల్లికార్జున, పూతలపట్టు స్వీరో మహేష్ పాల్గొన్నారు.

కోడూరి ప్రభాకర్ గ్రంథాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బహు గ్రంథకర్త కోడూరి ప్రభాకర్‌రెడ్డి రచించిన ఐదు గ్రంథాల అవిష్కరణ ఆదివారం అట్టహాసంగా సాగింది. స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో ప్రజా చైతన్య స్రవంతి వారి ద్వారా ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కానీ, సమీప ప్రాంతాల్లో కానీ ఒకే పర్యాయం ఒకే రచయిత రచించిన ఐదు గ్రంథాలు ఆవిష్కరింబడలేదని తెలిపారు. ఆ సదవకాశం ప్రజా చైతన్య స్రవంతికి లభించినందుకు సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సభ నిర్వహణ కావించిన టిఎస్ఎ కృష్ణమూర్తి, కోడూరి ప్రభాకర్ రెడ్డి 45 గ్రంథాలలో ముఖ్యమైన స్మృతి కావ్యం 'తుషార ప్రతిమ' గ్రంధాన్ని విశ్లేషించారు. డాక్టర్ అలుగుంటి సిద్ధారెడ్డి, కామకోటి ప్రసాద్ రావు తిరుపతి నుండి విచ్చేసిన డి.యం.ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎన్.సుమతిరెడ్డి, వై.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ భయ్యారెడ్డి, డాక్టర్ సంగమ్మ గ్రంథకర్త కృషిని ప్రశంసిస్తూ మాట్లాడారు. మీరా భజనలు పద్య కావ్యాన్ని వై. శ్రీనివాసులురెడ్డి ఆవిష్కరించగా సురభి హేమలత గ్రంథ సమీక్ష గావించారు. కర్పూర వసంత రాయలు, లకుమ శ్రావ్య నాటికల గ్రంధాన్ని ఎన్.సుమతిరెడ్డి ఆవిష్కరించగా ఆకుల మల్లేశ్వర రావు సమీక్ష గావిం చారు. పుట్టపర్తి నారాయణాచార్యుల జీవితం, కవిత్వం, వ్యక్తిత్వం గ్రంధాన్ని డాక్టర్ అలుగుంటి సిద్ధారెడ్డి ఆవిష్కరించగా జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి సమీక్ష నిర్వహించారు. వజ్ఞాలగ్గం ప్రాకృత కావ్య పద్యాను సృజన గ్రంధాన్ని పండిత వాసా కృష్ణమూర్తి ఆవిష్కరించగా ప్రొఫెసర్ జ్ఞాని చంద్రశేఖర్ శర్మ సమీక్ష కావించారు. కార్యక్రమంలో శ్రీనివాసుల నాయుడు, కొడవటి ప్రభాకర్, గణముక్కల శ్రీధర్, అడ్వకేట్ రామ గోపాల్ రావు, చెన్నూరి పవన్ కుమార్, ఆర్. వెంకటేశ్వర, కే విశ్వనాథరావు, డిఆర్ దయానంద రెడ్డి, ఎస్. ముని గోపాలకృష్ణ, కే. ధనలక్ష్మి, డి నాగరాజరావు, ఇండ్లూరు అంజలి, రామిగాని ఉమాదేవి, జింకల మోహన్ వల్లి, డి.నాగరాజరావు, ఆర్. వసంత కుమార్, జగన్మోహన్ గాంధీ పాల్గొన్నారు.

ఆకాశాన్నంటుతున్న నిత్యావసర ధరలు

- మార్కెట్ ధరకంటే అధిక ధరలకు విక్రయాలు
- పట్టని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి-చిట్వేలి


నిత్యావసర వస్తువులు

నిత్యవసర సరుకులు ఆకాశాన్ని అంటుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేక పోతున్నారు. పెరిగిన ధరలకు తోడు మండలంలో వ్యాపారులంతా కుమ్మక్కై మార్కెట్ ధర కన్నా అధికంగా విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజూ నిత్యావసర వస్తువుల మార్కెట్‌కు అనుగుణంగా హెచ్చు తగ్గులు జరుగుతుంటాయని కానీ ఇక్కడ మాత్రం వ్యాపారులు నిర్ణయించిన ధరకే కొనాలని చెబుతున్నారు. విజిలెన్స్ అధికారులు కూడా నామమాత్రంగా తనిఖీలు చేసి వెళ్లి పోతు న్నారని అంటున్నారు. దుకాణదారులందరూ కమిటీగా ఏర్పడి అధికారులను సమన్వయం చేయడంతో వారు కూడా అంతా సజావుగా ఉందంటూ చేతులు దులుపుకుంటున్నారని ఆరోపి స్తున్నారు. అనేక వస్తు వుల పైన తూకాల్లో తేడాలు, మార్కెట్లో వచ్చే నూతన ఉత్పత్తులను చౌకగా తీసుకువచ్చి విక్రయాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. నెల్లూరు, ప్రొద్దుటూరు ఇతర పట్టణాల నుంచి ఎలాంటి వే బిల్లులు లేకుండా వస్తువులు దిగుమతి అవుతూ ఉంటాయని తెలిపారు. వంటకు నిత్యం వాడే నూనెలు, బియ్యం, పప్పు దినుసులు తదితర వస్తువుల్లో నాణ్యత కొరవడుతోందని పేర్కొన్నారు. అధికారులు పరిశీలనకు వచ్చేటప్పుడు ముందస్తు సమాచారంతో ఆరోజు దుకాణాలను మూసివేస్తారని, నిబంధనలు సక్రమంగా పాటిస్తే దుకాణాలను మూసివేయాల్సిన పరిస్థితి ఎందుకుంటుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నిత్యవసర ధరలు ఆకాశాన్ని తాగుతున్న వేళ ప్రభుత్వాలు వాటిపై చర్యలు ధరలను తగ్గించాలని కోరుతున్నారు. పెరిగిన ధరలతో జీవనం కొనసాగించాలంటే పెను భారంగా మారు తోందని ఆవేదన్య వ్యక్తం చేస్తు న్నారు. చుట్టుప్రక్కల 28 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్టణాల్లో లేని ధరలు ఇక్కడే ఎందుకు ఉంటున్నాయో అధికారులు విచారణ చేయాలని పేర్కొన్నారు. ధరలపై నిఘా ఉంచి, ప్రభుత్వ ఆమోదం లేని ఆరోగ్యానికి హానికరం కలిగించే వస్తువుల విక్రయాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

ఆదరించారు..అభివృద్ధి చేసి చూపిస్తా :'నల్లారి'


ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కలికిరి

ఆదరించి గెలిపించారని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. టిడిపి కార్యకర్తల ఆహ్వానం మేరకు గుట్టపాలెం పంచాయతీ ఎల్లంపల్లికి విచ్చేసిన ఆయనకు కార్యకర్త మల్లికార్జునగౌడ్ గౌరీ స్వాగతం పలికారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బాలాజీ, యశోద కుటుంబ సభ్యుల వారి ఆహ్వానం మేరకు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల క్షేమ సమాచార అడిగి తెలుసుకున్నారు. విభిన్న ప్రతిభావంతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.6వేలకు పింఛన్‌ను పెంచి మాట నిలుపుకున్నారని బాలాజీ కిషోర్ కుమార్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆదరించి గెలిపించారని, నియోజకవర్గాన్ని అన్ని విధాలఅభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నల్లారి చంద్రారెడ్డి, నిరంజన్ రెడ్డి, బి.వెంకటరమణ మాజీ ఎంపిటిసి యతేంద్ర, జనార్ధన్ గౌడ్, గోవర్ధన, బిసినాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బెస్తలకు అండగా ఉంటాం

నియోజకవర్గ పరిధిలో ఉన్న బెస్త సంక్షేమ సంఘం కుటుంబాలకు అండగా ఉంటానని, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరిపల్లెలో ఆదివారం నియోజకవర్గ బెస్త సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను కలిసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సంఘం సభ్యులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అందేలా చూడాలని కోరారు. బెస్త సంఘానికి అన్నివిధాలా అదుకొని మీ సమస్యలకు పరిష్కార మార్గం చూపుతానని అన్నారు. కార్యక్ర మంలో బెస్తసంఘం గౌరవ అధ్యక్షులు కృష్ణయ్య, అధ్యక్షులు రెడ్డెప్ప, కార్యదర్శి రూపేష్ కుమార్, కార్య వర్గ సభ్యులు బెస్తపల్లి పాల రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని జ్యోతి చౌక్, మండలంలోని గట్టు, తుమ్మనగుట్ట గ్రామాల్లో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. ఎంఆర్‌పిఎస్ జెండాను ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్ల ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నేతృతంలో పోరాటం చేసి సాధించిన ఫలితాలు సాధించారన్నారు. గుండె జబ్బుల చిన్నారుల పోరాటంతో ఆరోగ్యశ్రీ సాధించారన్నారు. విభిన్న ప్రతిభావంతులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు పింఛన్‌ను సాధించకున్నామని అన్నారు. 2024 ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమికి మద్దతు కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం వచ్చేందుకు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి నాయకులు భవాని వెంకటేష్, మండల కన్వీనర్ చౌడప్ప, కో-కన్వీనర్ గట్టు రమణ, టిడిపి మండల యువనాయకులు గట్టు అంజి, సీనియర్ నాయకులు పిటిఎం రామప్ప, దేవరాజు పల్లి శంకర, గంగులప్ప, వేణు, కొమ్మురాముడు, మల్లెల నరసిం హులు, గట్టు నరసింహులు పాల్గొన్నారు.

ములకలచెరువు : ఎంఆర్‌పిఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ములకలచెరువు మండలంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ములకలచెరువు మండలం కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి, జాతీయ రహదారి పక్కన ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరణ, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలును ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.ప్రతాప్ కుమార్, ఎంఎస్‌పి నియోజకవర్గ కో-ఇన్‌ఛార్జి తిరుపాలు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు తుడుం శ్రీరాముల, మండల ప్రధాన కార్యదర్శి యమ్. విజయ్‌కుమార్, మన యువసేన నాయకులు కొమ్ము నరసింహులు, ఎంఇఎఫ్ నాయకులు అంజనప్ప, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు బోడోల్ల వెంకటస్వామి, మండల నాయకులు తోపు రమణ, నారాయణ, ఎండపల్లి భాస్కర్, గొందిపల్లి లక్ష్మన్న, వెంకటరమణ పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: విహెచ్ పిఎస్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ 59వ పుట్టినరోజు వేడుకలు వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో పట్టణంలోని శాంతిసదన్ వృద్ధాశ్రమంలో ఘనంగా జరుపుకున్నారు. వృద్ధులకు బియ్యం పంపిణీ చేసి, వారి సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, షేక్ మౌలాలిలు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రభుత్వాలు, సమాజం, కుటుంబ సభ్యుల నిరధారణ గురైన వికలాంగుల్లో ఐక్యతను పెంచి, చైతన్యం తెచ్చి, ఆత్మగౌరవం, హక్కుల ఉద్యమానికి పునాదులు వేసిన మంద కృష్ణ మాదిగ విభిన్నప్రతిభావంతుల ఆత్మబంధువుగా వారి గుండెల్లో నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఎస్ పి టౌన్ ఇన్‌ఛార్జి రాజా, విహెచ్ పిఎస్ ఉద్యోగ విభాగం నాయకులు జగదీష్, చెవిటి మూగ సంఘం నాయకులు మధు కుమార్ , పద్మనాభం, రమణ, స్టోర్ నాయుడు, ఈశ్వరి, రెడ్డెమ్మ, రాజంపేట విభిన్న ప్రతి వంతుల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రెడ్డి, వెంకటరమణ నాయుడు, సునీల్, నాగరాజు పాల్గొన్నారు.

తంబళ్లపల్లి : మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట హరిత సర్కిల్లో ఎంఆర్‌పిఎస్ పథకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో వెంకటప్ప, మల్లికార్జున ఆధ్వర్యంలో పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టి సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మద్యప్ప,రమణ, భాస్కర్ రామచంద్ర, రెడ్డప్పరెడ్డి పాల్గొన్నారు.


ములకలచెరువు : జెండా ఎగురవేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు


మదనపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సుండుపల్లె :వేదికపై ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-సుండుపల్లె

ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు... చేసే అల్లరి స్నేహితుల కోసం చేసే ఫైటింగ్లువారితో కలిసి ఆడిన ఆటలు...చిన్న చిన్న గ్యాంగ్లుఅవన్నీ ఓ మధురమైన క్షణాలు. మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 20 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆనందంగా గడిపారు జిల్లా టి.సుండుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు. 2004-05 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వాట్సప్ వేదికగా ఆరు నెలల నుంచి మిత్రులందరూ ఒకరినొకరు పరిచయం చేసుకుని ఈ కార్యక్రమం నిర్వహించుకున్నారు. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన టీచర్లను సాదరంగా ఆహ్వానించారు. చదువు అనంతరం వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారు.. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని మధుర జ్ఞాపకాలను తలుచుకుంటూ సంతోషంగా గడిపారు. చదువుకున్న రోజుల్లో కొన్ని సంతోషాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తమలాంటి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి, తీర్చిదిద్దిన గురువులను సన్మానించుకోవడం సంతోషంగా ఉందన్నారు. చనిపోయిన తోటి మిత్రులకు సంతాపం తెలిపారు. పూర్వ విద్యార్థి, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి ధర్మానాయక్ మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలిసేందుకు ఆరు నెలలు పాటు కష్టపడ్డామని, వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ అందరినీ ఒక్కచోటుకు చేర్చడానికి తీవ్రంగా శ్రమించామన్నారు. కష్ట పడితే ఫలితం దక్కుతుందనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని, సంఘటిత కృషితో 2004-05 బ్యాచ్ విద్యార్థుల్లో 70 శాతం మంది హాజరుకావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధర్మ నాయక్, నాగార్జున్, నాగరాజు, జయప్రకాష్, రఘు, వసంత, సింధూరి, శివకళ, ఓబుల్ సుబ్బయ్య, మౌలాలి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ములకలచెరువు : మండలంలోని సోంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003బ్యాచ్ పదో తరగతి చదువు కున్న విద్యార్థులు దేశ విదేశాలలోను, ప్రభుత్వ, ప్రయివేట్ రంగంలో స్థిరపడిన వారు ఆదివారం పాఠశాల ఆవర ణంలో ఒకే చోట కలుసుకుని, పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి మరపురాని మధురమైన సంఘ టనలు, చిలిపి చేష్టలను గుర్తుకు తెచ్చుకుని ఆద్యంతం ఉల్లాసంగా, సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సాయం చేస్తామని వారు తెలిపారు. దాదాపు21 ఏళ్ళ తరువాత ఈ ఆత్మీయ సమ్మేళనం వారంతా ఏర్పాటు చేసుకున్నారు.. ఆనాటి అధ్యాపకులు కృష్ణారెడ్డి, నాగరాజు, శంకప్ప, సతీష్ కుమార్, శంకరమ్మ లను ఘనంగా సత్కరించారు.తమ పట్ల చూపిన అభిమానానికి ఆ పూర్వ విద్యార్థులు నమస్కార వదనంతో సంస్కారం మేళవించి ఘనంగా సత్కరించి గౌరవించారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు ఆరగించారు.గ్రూప్ ఫోటోలు దిగి కొంగొత్త జ్ఞాపకాలు పదిలం చేసుకున్నారు. కార్యక్రమాల్లో అప్పటి ఉపాధ్యా యులు, పూర్వవిద్యార్థులు ఎస్.ప్రభాకర్, అజీమ్‌బాషా, శ్రీనివాసులు, బావజన్, ప్రతాప్, కరూముల్ల, అరుణ్‌కుమార్, శిల్ప, మీనాక్షి, పార్వతీ, రాజశేఖర్, డి అరుణ్ కుమార్, నరసింహులు, నాగభూషణం, సరస్వతి, అశ్వని, నరసింహారెడ్డి పాల్గొన్నారు.


ములకలచెరువు: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


మదనపల్లి: మురహరిని సన్మానిస్తున్న ఎంఇఒలు, ఉపాధ్యాయులు

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ప్రజాశక్తి-సుండుపల్లి

విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తే వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దితే గ్రామాలలో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు గుర్తుంచుకుంటారని గుల్లవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల అభివృద్ధి దాత డాక్టర్ శరత్ గిరిరెడ్డిపేర్కొన్నారు. గుల్లవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సావిత్రమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ సుండుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి డాక్టర్ ఎర్రపురెడ్డి శరత్ గిరిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత గ్రామంలో ఉన్న పాఠశాలను అభివృద్ధి పరిచే అందుకోసం అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ వెంకటేష్ నాయక్ పాఠశాలలో ఫ్లోర్ దెబ్బతినిందని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన మరమ్మత్తులు చేయిస్తానని హామీ ఇచ్చారు. పిఆర్‌టి యు రాష్ట్ర అధ్యక్షులు అన్నమయ్య జిల్లా క్రమశిక్షణ కమిటీ జిల్లా సభ్యులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన సావిత్రమ్మ, ఆమె భర్త చెన్నకేశవులు అని పేర్కొన్నారు. ఎంఇఒలు వెంకటేష్ నాయక్, రవీంద్ర నాయక్ మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 60 మంది విద్యార్థులు ఉన్నారని వారికి ఇద్దరే ఉపాధ్యాయులు ఉండి విద్యాబోధన చేస్తున్నారని అన్నారు. ఇంకో ఉపాధ్యాయుని నియమించేందుకు కోసం తాము చర్యలు తీసుకున్నామని తెలిపారు. అనంతరం సావిత్రమ్మ , చెన్నకేశవుల దంపతులను పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరిం చారు. **మదనపల్లి :** ప్రతి ఉద్యోగికి పదవీవిరమణ సహజమేనని ఆదివారం జవహర్ నవోదయ పాటశాలలో ఎంటిఎస్ తీరువీది మురహరి 33 సంవత్సరాలు విధులు నిర్వహించి గత నెల 30న పదవీవిరమణ పొందారు. ఆదివారం తిరువీది మురహరి పదవీ విరమణ కార్యక్రమం ప్రిన్సిపల్ బి.గోవిందరావు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 33 ఏళ్ళు నిర్విరామంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందడం గర్వంగా ఉందని అన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంత జీవనం కొనసాగించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండి తమ విలువైన సూచనలు,సలహాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు సహచరులు, ఉపాధ్యాయులు, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు జనార్దన్, మోహన్ పాల్గొన్నారు

మందరంలో పశుగ్రాస వారోత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మందరం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో రైతులకు పశుగ్రాసం పెంపకం, వినియోగం వంటి వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ భాస్కర్‌రావు మాట్లాడుతూ ఏక వార్షిక, మహా వార్షిక పశుగ్రాసములు మరియు కాయఖాతి పశుగ్రాసముల ప్రాముఖ్యత, వాటిలోని పోషక విలువలు గురించి రైతులకు వివరించారు. మునగ, కరివేప, అవిసె, సుబాబుల్ గ్రాసముల గురించి వివరించి పశుగ్రాసము వాడకం వలన రైతులు దాణా ఖర్చును తగ్గించుకొని పాల ఉత్పత్తిని పెంపొందించుకోవచ్చునని తెలిపారు. వరిగడ్డిని సుపోషకము చేయు విధానము, చాప్ కట్టర్ తో గడ్డి కత్తిరించి వాడుట వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం గొర్రెలకు నీలి నాలుక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కే.ప్రతాప్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ భాగ్యవతి, జెవిఒ వరదయ్య, మందరం కొత్తపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రంక్ పెట్టెలు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణానికి చెందిన హనీ ఫ్రెండ్స్ గ్రూప్ దాతృత్వాన్ని చాటుకుంది. ఆదివారం స్థానిక చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నందు విద్యార్థులకు రూ.15 వేలు విలువగల ట్రంక్ పెట్టెలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జివిఎస్ బాబు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసి విశ్రాంతంగా ఉన్న సమయంలో వారి అమూల్యమైన సమయాన్ని తెలివితేటలను, వారి సొంత నిధులతోను విద్యార్థుల కోసం వెచ్చించడం ఎంతో హర్షణీయమన్నారు. హనీ ఫ్రెండ్స్ గ్రూప్ మరెన్నో బృహత్తర కార్యాలు చేయాలని ఆకాంక్షించారు. వీరందరిని ఒక తాటిపైకి తీసుకువచ్చిన గ్రామ జ్యోతి సొసైటీ డైరెక్టర్ సుభద్రమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. జనరల్ సెక్రెటరీ కవిత రాణి హని ఫ్రెండ్స్ గ్రూపు సభ్యులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హనీ ఫ్రెండ్స్ సభ్యులు గ్రామ జ్యోతి సొసైటీ ఫౌండర్ సుభద్రమ్మ, రిటైర్డ్ సిహెచ్ఒలు కృపావరమ్మ, ఈశ్వరమ్మ, పార్వతమ్మ, పి.మంగమ్మ ఐసిడిఎస్ సూపరిండెంట్ బిఆర్.వనమాల, పబ్లిక్ హెల్త్ నర్స్ ఎన్.పద్మ, స్కూల్ అసిస్టెంట్ పి.మని, నర్సు ఉష విద్యార్థులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి -రైల్వేకోడూరు



మాట్లాడుతున్న చంద్రశేఖర్

రైల్వే కోడూరులో దీర్ఘకాలిక సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కారం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం కోడూరు సిఐటియు కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ మునక ప్రాంతాల రక్షణ కోసం నరసరాంపేట, వసంత నగర్, ధర్మాపురం, ప్రాంతాలకు, గుంజన నది రక్షణ గోడ నిర్మించాలని అన్నారు. భూగర్భ జలాల నిల్వకు, గుంజన నదులులలో చెక్ డ్యామ్‌లు నిర్మించాలని పేర్కొన్నారు. కోడూరు వెంకటగిరి రోడ్డు పూర్తిచేసి రాజధాని కి దగ్గరగా ప్రారంభించాలని కోరారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు. పేదలకు వివాహాలు ఫంక్షన్లకు,టీటీడీ కళ్యాణ మండపం ఏర్పాటు చేయాలన్నారు.నియోజకవర్గ కేంద్రంలో ఆర్‌టిసి డిపో గ్యారేజీ ఏర్పాటు చేయాలన్నారు. 50 పడకల నుంచి వంద పడకల ఆసుపత్రిగా, అభివృద్ధి చేయాలన్నారు. వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగాంచిన కోల్డ్ స్టోరేజ్ లు ఏర్పాటు చేయాలని, అనంతరాజుపేట మ్యాంగో అప్ప జ్యూస్ ఫ్యాక్టరీ తెరిపించాలని పేర్కొన్నారు. స్థానిక మిల్లులకు, క్రసింగ్ ఆర్డర్ ఇచ్చి మూతపడిన బరైటీస్ మిల్లులు తెరిపించాలని చెప్పారు. వాగేటి కోన, చాకిరేవు కోన,గొట్టి మానుకోన, చెరువులను, మరమ్మత్తులు చేసి, సాగుకు నీటి నిల్వ చేసి రైతులకు అందించాలని పేర్కొన్నారు. దీర్ఘకాలిక డిమాండ్‌గా ఉన్న ట్రాఫిక్ నివారణకు బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. నిలిచిపోయిన రైల్వే అండర్ బ్రిడ్జి,రెడ్డివారిపల్లిబ్రిడ్జి పనులు పూర్తి చేయాలన్నారు. పభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న కాంట్రాక్ట్ ,ఔట్ సోర్స్, స్కీం వర్కర్లు, పనిచేస్తున్న వారిని, కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత, అధికార పార్టీ నాయకులు, రాజకీయ కక్షతో తొలగించాలనే ఆలోచన వేధింపులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు లింగాల యానాదయ్య, సుబ్బరామయ్య, పి.జాన్ ప్రసాద్ పాల్గొన్నారు.

నాయకత్వ లోపం వల్లే ఓటమి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట : సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఓటమికి నాయకత్వ లోపమే కారణమని, కార్యకర్తలు కారని టిడిపి సీనియర్ రాష్ట్ర నాయకులు, రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, రాష్ట్ర మహిళా కమిటీ సభ్యులు ఓబినేని సుబ్బమ్మ, వీరబల్లి మండల టిడిపి అధ్యక్షులు భానుగోపాల్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక హరిత హోటల్‌లో నియోజకవర్గ, మండల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి విజయం సాధించిన తంబళపల్లి, రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటమి చెందామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అందరూ కష్టపడ్డారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు లోకేష్ నాయకత్వ లోపాన్ని గుర్తించి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించి కార్యకర్తలకు న్యాయం జరిగే విధంగా మంచి నాయకత్వాన్ని ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.